సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి తులసి అర్చన



తులసి పూజలు అందుకున్న అమ్మవారు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లోని శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం సహస్ర తులసి అర్చనను వైభవంగా నిర్వహించారు. ముందుగా వేకువజామున అమ్మవారిని అభిషేకించి అలంకరించారు. అర్చనల అనంతరం దుర్గా హోమం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాటల పందిరి సత్యానంద్‌కు నివాళులు



సత్యానంద్‌కు నివాళులు అర్పిస్తున్న వాకర్స్

పీఎం పాలెం: రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన సీహెచ్ సత్యానంద్‌కు జాతర వాకర్స్ పాటల పందిరి సభ్యులు నివాళులర్పించారు. శిల్పారామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి బాబూరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాకర్స్ నారాయణ స్వామి, ప్రకాష్, రామ్‌ప్రసాద్, గోవింద్, అప్పలనాయుడు, వాణి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



మహారాజ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఈడీ రాణి

కొమ్మాది: బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ (టీసీఆర్‌టీఎం) ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. టీసీటీఆర్‌ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణిమందా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ నిస్వార్థమైన సేవలతో గిరిజన సంచార జాతుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు.

నవోదయలో సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్


కొమ్మాది: సరైన సైన్స్ నమూనాను రూపొందించి, వాటి ద్వారా శాస్త్రీయ విజ్ఞానాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించడం ద్వారా విద్యార్థుల అవగాహన శక్తి మెరుగవుతుందని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ డా.వై.ఎస్.ఎస్. చంద్రశేఖర్ అన్నారు. శనివారం నవోదయలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలను ఆయన ప్రారంభించారు. కేంద్ర సాంకేతిక విజ్ఞాన శాస్త్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనను గీతం వర్సిటీకి చెందిన 32మంది విద్యార్థులు రోబోటిక్స్, సాంద్రత, ఎలక్ట్రానిక్ పరికరాలు, విద్యుదయస్కాంత తరంగాలు తదితర పలు నమూనాలను ప్రదర్శించి, వివరించారు.

కేజీబీవీ విద్యార్థినులకు రగ్గుల పంపిణీ

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 267 మంది విద్యార్థినులకు విశాఖ అపూర్వ ఆస్పత్రి వైద్యులు మూర్తి, సుందరి రగ్గులు, దుప్పట్లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 118 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. నగరానికి చెందిన వాసవి ఇంటర్నేషనల్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు సిబ్బంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, సీఏంవో సుబ్బరాజు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో హరగోపాల్ పాల్గొన్నారు.



గిరిపై మలుపుల వద్ద బీటీ రోడ్డు, మట్టి జారిపోకుండా రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన స్టోన్ పిచింగ్

బీటీ రోడ్డు నిర్మాణమిలా..

నిధులు	పొడవు	మలుపులు
రూ.5 కోట్లు	3,150 మీటర్లు	9

- రోడ్డు పటిష్టతకు మలుపుల వద్ద స్టోన్ పిచింగ్
- 50 కార్ల పార్కింగ్‌కు 80 మీటర్ల నిడివిలో ప్లాట్‌ఫాం
- వర్షపు నీరు రోడ్డు మీదకు రాకుండా కెర్బ్ వాల్స్



గిరిపై నుంచి వర్షపు నీరు రోడ్డు మీదకు రాకుండా నిర్మించిన కెర్బ్‌వాల్



అనంతుని గిరి పైకి వేసిన బీటీ రోడ్డు

అనంతుని చెంతకు నిశ్చింతగా..

- రూ.5 కోట్లతో ఘాట్ రోడ్డు బీటీగా అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ హయాంలో శ్రీకారం
- భక్తుల హర్షాతిరేకాలు

అత్యంత అరుదైన ఆలయం పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయం. భారతదేశంలో రెండు చోట్ల మాత్రమే ఈ ఆలయాలు ఉన్నాయి. ఒకటి కేరళలోని తిరువనంతపురం కాగా రెండోది ఇక్కడిది. అంతటి ప్రాధాన్యం ఉన్న అనంత పద్మనాభుని సన్నిధికి చేరుకునేందుకు సరైన మార్గం లేక భక్తులు అవస్థలు పడేవారు. వారి చింతను దూరం చేస్తూ వైఎస్సార్‌సీపీ హయాంలో ఘాట్‌రోడ్డును బీటీగా అభివృద్ధి చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేశారు. గతేడాది ఫిబ్రవరిలో ప్రారంభమైన పనులు పూర్తి కావడంతో భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పద్మనాభం: పద్మనాభం గ్రామంలోని గిరిపై కొలువుదీరిన అనంత పద్మనాభుని దర్శనానికి మార్గం సుగమం అయింది. గిరి పైకి ఉండే మట్టి ఘాట్ రోడ్డు బీటీగా రూపాంతరం చెందింది. దీంతో భక్తుల సంఖ్య మరింత పెరగనుంది.

గతంలో ఇలా..

పద్మనాభుని సన్నిధికి చేరుకునే ఘాట్‌రోడ్డు మట్టి రోడ్డు టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. ఘాట్ రోడ్డును బీటీగా అభివృద్ధి చేయకుండా వదిలేశారు. దీంతో వాహనాల్లో గిరిపైకి వెళ్లడానికి భక్తులు భయాందోళన చెందేవారు. ఘాట్ రోడ్డు ప్రయాణం సురక్షితం కాకపోవడంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా గిరిపైకి వెళ్లి అనంతుని దర్శించుకునే పరిస్థితి ఏర్పడింది. త్రిభుజాకారంలో అత్యంత ఎత్తులో ఉండే అనంతుని గిరి పైకి 1286 మెట్లు ఎక్కి పైన ఉన్న దేవదేవుడిని దర్శించుకోడానికి భక్తులు ఇబ్బంది పడేవారు. వృద్ధులు, దివ్యాంగులు అనేకమంది మెట్లమార్గం ద్వారా గిరిపైకి వెళ్లలేక ప్రథమ పావంచా వద్దే మొక్కులు చెల్లించుకుని వెనుదిరిగే పరిస్థితి.



గిరిపై కార్ల పార్కింగ్‌కు సిమెంట్‌తో ప్లాట్‌ఫాం



బీటీ రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన కల్వర్టు

పకడ్బందీగా నిర్మాణం

- ✓ 3,150 మీటర్ల నిడివిగల మట్టి ఘాట్ రోడ్డును బీటీగా అభివృద్ధి చేశారు.
- ✓ అనంతుని కన్నయ్య కోనేరు సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఐదు వందల మీటర్లు నిడివి వరకు 7.5 మీటర్ల వెడల్పులో రోడ్డు అభివృద్ధి చేశారు. దీనిలో మధ్యలో 3.5 మీటర్ల వెడల్పు బీటీగా.. మిగతా భాగం రెండు పక్కలా మట్టితో అభివృద్ధి చేశారు. మిగతా 2,650 మీటర్లు గిరి పై వరకు 5.5 మీటర్ల వెడల్పు బీటీగా అభివృద్ధి చేశారు.
- ✓ కొండపై నుంచి నీరు రోడ్డు మీదకు రాకుండా 690 మీటర్ల నిడివిలో కెర్బ్ వాల్స్ నిర్మించారు.
- ✓ కొండపై నుంచి నీరు కిందకు పోయేందుకు అనువుగా రెండు చోట్ల కల్వర్టులు నిర్మించారు. గిరిపై గతంలో ఉండే పార్కింగ్ పది కార్లు పెట్టుకోవడానికి సరిపోయేది కాదు. దీన్ని ఇప్పుడు సుమారు 50 కార్లు పెట్టుకునేందుకు 80 మీటర్ల నిడివిలో సిమెంట్‌తో విస్తరించారు.
- ✓ రోడ్డుకు తొమ్మిది మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద మట్టి రాలిపోకుండా స్టోన్ (రాతి కట్టడాలు) పిచింగ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల కృషితో..

అనంతుని ఘాట్ రోడ్డును బీటీగా అభివృద్ధి చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ విషయాన్ని వైవీ సుబ్బారెడ్డి అప్పటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో పంచాయతీ రాజ్ నిధులు రూ.5 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ఘాట్‌రోడ్డును బీటీగా అభివృద్ధి చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. గతేడాది ఫిబ్రవరి రెండో తేదీన ప్రారంభమైన పనులు పూర్తి కావడంతో అనంతుని చెంతకు మార్గం సుగమం అయింది.

భక్తుల చిరకాల వాంఛ నెరవేరింది



అనంత పద్మనాభ స్వామి గిరిపైకి పక్కా రోడ్డు నిర్మించారు. కొండ ఎత్తుగా ఉండడం వల్ల మెట్ల మీద నుంచి వృద్ధులు, దివ్యాంగులు వెళ్లడం కష్టమయ్యేది. తారు రోడ్డు నిర్మించడం వల్ల అందరూ కొండపైకి వెళ్లి స్వామిని దర్శించుకునే భాగ్యం కలిగింది.

– కె.ప్రకాష్

దివ్య క్షేత్రంగా వెలుగొందుతుంది



అనంత పద్మనాభ స్వామి గిరిపైకి తారు రోడ్డు వేయడం వల్ల ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువవుతుంది. ఆలయం దివ్య క్షేత్రంగా వెలుగొందుతుంది. కొత్తగా నిర్మించిన తారు రోడ్డుపై నడుచుకుంటూ మా కుటుంబ సభ్యులందరం కొండ మీదకు వెళ్లాం. మెట్లపై నుంచి అయితే వెళ్లలేం. విజయనగరం నుంచి వచ్చి గిరిపై ఉన్న అనంతుని ఆలయానికి వెళ్లి పూజలు చేశాం

– ఎం.శ్యామలా గౌరి, విజయనగరం

వ్యర్థరహిత నగరంగా విశాఖ

- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- ఎండాడలో 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' ప్రతిజ్ఞ, ర్యాలీ



మధురవాడలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసరావు



బక్కన్నపాలెం పోలీస్ బెటాలియన్‌లో..



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఇన్‌చార్జ్ జీవీఎంసీ కమిషనర్ హరేందిర ప్రసాద్



రుషికొండలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న టూరిజం అధికారులు



కళాశాల ఆవరణలో చెత్తను తొలగిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



దివీస్ లేబొరేటరీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొమ్మాది: వ్యర్థరహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 8వ వార్డు ఎండాడలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రాంగణంలో వ్యర్థాల విభజన, సేంద్రియ ఎరువుల తయారీ, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను విభజించి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. తడి వ్యర్థాల నుంచి ఇంటి వద్దనే సేంద్రియ ఎరువును తయారు చేసి మిద్దె తోటలపై, కమ్యూనిటీ గార్డెన్లలో వినియోగించుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలన్నారు. వ్యర్థాల పునర్వినియోగ ప్రక్రియకు నివాసిత సంక్షేమ సంఘాలు, ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులు, ఆర్పీలు సహకరిస్తే నగరాన్ని వ్యర్థరహితంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను పరిశీలించి స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ప్లకార్డులతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్ వర్మ, ప్రధాన వైద్యాధికారి డా. నరేష్, ఏఎంవోహెచ్ డా.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: రుషికొండలో టూరిజం డివిజనల్ మేనేజర్ జి.జగదీష్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. సిబ్బందితో బీచ్‌లో వ్యర్థాలను తొలగించి, ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు నాగార్జున, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

- సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయిని ఎస్‌కె నూర్జహాన్ విద్యార్థులతో కలసి శుభ్రత కార్యక్రమం చేపట్టారు. అనంతరం 110 మొక్కలను నాటారు.

భీమునిపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో చెత్తను తొలగించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ డి.ప్రవీణ పాల్గొన్నారు.

మధురవాడ: రైతు బజార్‌లో ఈవో హరిత ఆధ్వర్యంలో పరిసరాలు శుభ్రం చేశారు.

- మధురవాడ పీహెచ్‌సీలో వైద్యాధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో, చంద్రంపాలెం హైస్కూల్లో హెచ్‌ఎం రవి ఆధ్వర్యంలో, విద్యుత్ శాఖ జోన్–3 కార్యాలయంలో ఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పరిసరాలు శుభ్రం చేశారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

స్వచ్ఛాంధ్రకు పాటు పడదాం

తగరపువలస: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రకు పాటుపడదామని చిప్పాడ దివీస్ లేబొరేటరీ డైరెక్టర్ ఎస్.దేవేంద రరావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి.రమణ కోరారు. శనివారం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఉద్యోగులు కలిపి 300 మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతకు సమయం కేటాయించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు.

- చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీవాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీ సురేష్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, డస్ట్‌బిన్ల వాడకం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.
- భీమిలి మండలం తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు.
- బంగ్లామెట్ట పాఠశాలలో హెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించారు.

విద్యార్థుల ర్యాలీ

పద్మనాభం: పద్మనాభంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఎంపీడీవో ఎం.విజయ కుమార్, ఈవోఆర్డీ మీనా కుమారి, మండల పరిషత్ ఏవో జయ ఉమ, పద్మనాభం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో అధికారులు, సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. 16వ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

హనుమ బుద్ధిబలం, వాగ్వైభవం అద్భుతం

మధురవాడ: శ్రీరాముడు హనుమ స్వామిని కలసిన మొట్టమొదటిసారి ఆయన వాగ్వైభవమును ఎంతగానో కీర్తించారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు వివరించారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచనాల్లో భాగంగా కిష్కింధకాండలో పలు అంశాలను తెలియజేశారు. సుగ్రీవుడి ఆజ్ఞ మేరకు రామలక్ష్మణులు ఎవరో తెలుసుకుందామని సన్యాసి రూపంలో వెళ్లిన హనుమ మాట్లాడిన తీరుకు వారు ఎంతగానో ఆశ్చర్యపోయారన్నారు. ఇలాంటి మంత్రి ఉన్న రాజు ఎప్పటికీ ఇబ్బందులు పొందడన్నారు. హనుమ బుద్ధిబలం, వాగ్వైభవమును శ్రీరాముడు ఎంతగానో కీర్తించారన్నారు. రాముడు సుగ్రీవునికి సీతమ్మ యొక్క అపహరణ తెలియజేయడం, అతనితో మైత్రి, తన వృత్తాంతం తెలియజేసిన సుగ్రీవునికి తిరిగి అతని రాజ్యమును, భార్యను అప్పగిస్తానని అభయమివ్వడం తదితర విషయాలు వివరించారు.

ఉత్సాహంగా కిడ్స్ కార్నివాల్

భీమునిపట్నం: కీతిన్‌పేట సన్‌స్కూల్‌లో కిడ్స్ కార్నివాల్ ఉత్సాహంగా జరిగింది. ఇందులో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలకు చెందిన చిన్నారులు పాల్గొని డ్యాన్స్‌లతో అదరగొట్టారు. గీతాలు, శ్లోకాలు ఆలపించారు. వివిధ వేషధారణల్లో అలరించారు. స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల అధ్యక్షురాలు లక్ష్మీలావణ్య చిన్నారులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్సులతో బోధనా పటిమ మెరుగు

పద్మనాభం: క్లస్టర్ కాంప్లెక్సు సమావేశాలు ఉపాధ్యాయులు తమ బోధనా పటిమను మెరుగు పరుచుకోవడానికి దోహదపడతాయని ఎంఈవో పి.రమణ అన్నారు. పద్మనాభం, అనంతవరం, ఆర్‌వీ పురం, రెడ్డిపల్లి, బీఆర్ తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం క్లస్టర్ కాంప్లెక్సు సమావేశాలు నిర్వహించారు. పద్మనాభం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లస్టర్ కాంప్లెక్సులో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలామణి పాల్గొన్నారు.

శ్మశానవాటిక నుంచి బయో మైనింగ్ వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



బయో మైనింగ్ వ్యర్థాలను బాబ్‌కాట్‌తో తొలగిస్తున్న దృశ్యం

తగరపువలస: గోస్తనీనది తీరాన శ్మశానవాటికకు తరలించిన బయో మైనింగ్ వ్యర్థాలను ఎట్టకేలకు శానిటేషన్ విభాగం శనివారం బాబ్‌కాట్‌తో శుభ్రం చేసింది. జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డు నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి కాంట్రాక్టర్ గతంలో శ్మశానవాటికకు తరలించిన బయో మైనింగ్ వ్యర్థాలతో ఇక్కడికి వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హిందువులు ఈ చర్యను నిరసించగా 'డంపింగ్‌యార్డు నుంచే బయోమైనింగ్ వ్యర్థాల తరలింపు' శీర్షికతో ఈ నెల 5న సాక్షిలో ప్రచురించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ వ్యర్థాలు తొలగించకపోవడంతో, వ్యర్థాల నుంచి మెడికల్ సూదులు బయటపడి అక్కడికి వెళ్లేవారికి గుచ్చుకోవడంతో 'శ్మశానవాటికలో సూదులు' శీర్షికతో శనివారం వార్త ప్రచురితమైంది. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి బాబ్‌కాట్‌తో వ్యర్థాలను ఊడ్పించారు. తరువాత వీటిని డంపింగ్‌యార్డుకు తరలించి, కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇస్తామన్నారు.

టీకాల లక్ష్యం పూర్తి చేయాలి



చిన్నారులకు వేస్తున్న టీకాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి కార్డిలియా

పద్మనాభం: వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వ్యాధి నిరోధక టీకాల జిల్లా అధికారి కార్డిలియా సూచించారు. మండలంలోని రేవిడి పీహెచ్‌సీ పరిధి వెంకటాపురంలో టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు సమీపిస్తున్నందున చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. శతశాతం పూర్తి కాకుంటే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా ఆమె పీహెచ్‌సీని సందర్శించి టీకాల స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఎంఎఫ్‌సీ సిబ్బంది రక్తదానం



ఎంఎఫ్‌సీ ఫ్యాక్టరీలో రక్తదానం చేస్తున్న సిబ్బంది

తగరపువలస: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం బంగ్లామెట్ట మణికంఠ ఫుడ్‌కోర్టులో 120 మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఇందులో మహిళా సిబ్బంది కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఫుడ్‌కోర్టు యజమానులు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో రక్తానికి ఉన్న కొరతను దృష్టిలో పెట్టుకుని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించారు. నందిక శ్రీనివాసరెడ్డి, వెంపాడ శ్రీనివాసరెడ్డి, మద్దిల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌కు సత్కారం

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన బెస్ట్ ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్ట్‌కు ఈ ఏడాది ప్రభుత్వం నుంచి బెస్ట్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ అవార్డు లభించింది. ఆంధ్ర, తెలంగాణ, ఒడిశాలో ఏళ్ల తరబడి వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో ఈ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గాడు ప్రదీప్‌కుమార్‌ను పలువురు అభినందించారు. ట్రస్ట్ సభ్యులు సత్కరించారు.